రోడ్డు వేశారు.. వ్యర్థాలను వదిలేశారు




ఏపీహెచ్‌బీ కాలనీ పార్కు-2 సమీపంలోని రోడ్డుపై వదిలేసిన సిమెంట్ వ్యర్థాలు

రంగారెడ్డినగర్: రోడ్డు నిర్మాణ వ్యర్థాలను తరలించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలోని పార్కు-2 సమీపంలోని గల్లీల్లో ఇటీవల రూ.25 లక్షల నిధులతో సీసీ రోడ్లు వేశారు. పనుల్లో భాగంగా ధ్వంసమైన రోడ్డు సిమెంట్ వ్యర్థాలను తవ్విన సంబంధిత కాంట్రాక్టర్ అక్కడే డంప్ చేసి చేతులు దులుపుకున్నాడు. రోడ్డు పనులు పూర్తై నెల రోజులు కావస్తున్నా వ్యర్థాలను తరలించకపోవడంతో స్థానికంగా రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ విషయమై కాలనీ అసోసియేషన్ సభ్యులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా తరలించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్ వ్యర్థాలను తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక

కుత్బుల్లాపూర్ : జోనల్ లెవెల్ క్రికెట్ సెలక్షన్ అండర్- 14, అండర్-17 కుత్బుల్లాపూర్ టీంలను ఎంపిక చేశారు. జోనల్ సెక్రెటరీ గోనె అరుణ జ్యోతి ఆధ్వర్యంలో దీక్షిత్ క్రికెట్ అకాడమీలో ఈ నెల 29న నిర్వహించిన సెలక్షన్‌కు నియోజకవర్గం మొత్తం వివిధ స్కూళ్ల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. వారికి ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేయించి అండర్-14 జట్టును ఎంపిక చేశారు. జేపీ నారాయణ, వివాన్ రెడ్డి, శ్రీహాస్, ఆర్య హరినాథ్ రెడ్డి ప్రణవ్, రణధీర్, విశాల్, జ్ఞానేశ్వర్, తాజుద్దీన్, నిశాంత్ రెడ్డి, అన్షుమాన్, అవనీష్, మయాంక్ పూజారి అశ్విత్, వర్షిత్, కనిష్కలను ఎంపిక చేశారు. అదేవిధంగా అండర్-17 జట్టును కూడా ప్రకటించారు. రుత్విక్ కుమార్, పేట హోమవేద్, యశ్వంత్ గౌడ్, అబ్దుల్లా, వినీల్ సుధీర్, చైత్ర సందీప్, ప్రతాప్ కుమార్, కోలా శశాంక్, శశిల్, శ్రేయాస్‌రెడ్డి, భవీష్ రెడ్డి, సంగమేశ్, పునీత్ నాగ సాయి తదితరులతో పాటు ముగ్గురిని స్టాండ్ బైగా ఎంపిక చేసినట్లు అరుణ జ్యోతి తెలిపారు.

బాధ్యతల స్వీకరణ.. సన్మానం



ఏఈ సురేందర్ నాయక్‌ను సత్కరిస్తున్న ఎంఆర్పీఎస్ నేతలు

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ ఏఈగా సురేందర్ నాయక్ నూతనంగా బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం ఎంఆర్పీఎస్, ఎంఎస్‌పీ నేతలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సిలువేరు శ్రీనివాస్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు రాసమల్ల యాదగిరి, జిల్లా యువసేన ప్రధాన కార్యదర్శి ఇసురం రమేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు నడిమిదొడ్డి సలోమి, సంఘీ మహేష్ తదితరులు పాల్గొన్నారు

చికిత్స కోసం చిన్నారికి సాయం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న చిన్నారికి కాంగ్రెస్ నియోకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి చేయూతనిచ్చారు. నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌కు చెందిన ధనుంజయ్ కుమారుడు (06) కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకోవడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో కొలన్ హన్మంతరెడ్డిని ఆశ్రయించారు. శుక్రవారం ఆయన బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. కేహెచ్‌ఆర్ సేవాదళ్ సభ్యులు, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తమవంతు సాయాన్ని 9666685869 నెంబరుకు ఫోన్‌పే, గుగూల్ పే చేసి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.

సమగ్ర కులగణన చేపట్టాలి



రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న సతీష్ కుమార్ పటేల్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: బీసీల న్యాయబద్ధ వాటా కోసం, సమగ్ర కులగణన కోసం శుక్రవారం జగద్గిరిగుట్ట ఇందిరాగాంధీ చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీసీ నాయకులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. బీఆర్‌ఎస్ రాష్ట నాయకుడు మాచర్ల భద్రయ్య పూలమాలలు వేసి సంఘీభావం తెలిపారు. అనంతరం బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు సతీష్ కుమార్ పటేల్ మాట్లాడుతూ.. సమగ్ర కులగణన చేపట్టి 42 శాతం స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కులగణన చేపట్టిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. లేకుంటే బీసీలంతా ఏకమై పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు పంతుల మల్లయ్య, భక్తుల రామ నరసయ్య, వీరాంజనేయ చారి, విఠల్, ఉగ్గే శ్రీనివాస్, శ్రీరాములు, సిద్ధి రాములు, తెలుగు సుధాకర్, నరసయ్య, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'వాక్ ఫర్ హోప్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మర్రి లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్: నగరంలోని జలవిహార్‌లో నవంబర్ 17వ తేదీన వాక్ ఫర్ హోప్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. శుక్రవారం దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి పోస్టర్‌ను ఆవిష్కరించారు. వాక్ ఫర్ హోప్ అనే కార్యక్రమం ద్వారా నిధులు సమీకరించి తెలంగాణ రాష్ట్రంలో ఒక ప్రత్యేక హోం నిర్మిస్తామని, అందులో వృద్ధులు, అనాథ పిల్లలకు వసతి కల్పిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రమణి, సాకేత్ ప్రణామ్ హోమ్స్ ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నాయిని ఉదయ్ రంజన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణానికి అడ్డుకట్టేది?



దూలపల్లి ప్రధాన రోడ్డును ఆనుకుని చేపడుతున్న అక్రమ నిర్మాణం

చర్యలు తీసుకుంటాం



సదరు నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ఆ నిర్మాణాన్ని పరిశీలించి సదరు వ్యక్తిపై చర్యలు తీసుకుంటాం. అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతి వారైనా ఊరుకోం. అవసరమైతే ఆ నిర్మాణాన్ని తొలగిస్తాం.

– శ్రీహరి, కొంపల్లి మున్సిపల్ కమిషనర్

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా పదుల సంఖ్యలో నిర్మాణాలు జరుగుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు కేవలం నోటీసులతో సరిపెడుతున్నారు. ఇక నిర్మాణదారులు ఇదే అదునుగా పరిమితికి మించి నిర్మాణాలు చేపడుతున్నారు. దూలపల్లి ప్రధాన రోడ్డును ఆనుకుని ఉన్న ఎకర స్థలం కోర్టు వివాదంలో ఉంది. సదరు స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. అంతేగాక సదరు స్థలానికి మోటివేషన్, నాలా కన్వర్షన్ జరగలేదు. అయినప్పటికీ సదరు స్థలంలో ఓ వ్యక్తి ఏకంగా 500 గజాల స్థలంలో నిర్మాణం చేపడుతున్నాడు అంటే సంబంధిత అధికారులు ఆ వ్యక్తికి ఎంత భరోసా ఇచ్చారో అని స్థానికులు చర్చించుకుంటున్నారు. వారం రోజుల నుంచి నిర్మాణం పూర్తి చేసేందుకు పనులను వేగవంతం చేశాడు.

గాలి పీల్చలేం.. నీరు తాగలేం!

జీడిమెట్ల పారిశ్రామికవాడ పరిస్థితి ఇది



వర్షంతో చిత్తడిగా మారి రంగునీళ్లతో ఉన్న ప్రాంతం

- భూగర్భంలోకి రసాయన వ్యర్థాలు
- దీంతో రంగురంగుల్లో బోరు నీళ్లు
- కలుషితమైన ఫాక్స్‌కాన్ చెరువు
- వర్షం వస్తే చాలు రోడ్లు, డ్రైనేజీల్లోనే వ్యర్థాల పారబోత
- అక్రమంగా రసాయన గోదాంల ఏర్పాటు



మీతో సాక్షి

సాక్షి, సిటీబ్యూరో: మానవాళి మనుగడకు అత్యవసరమైనవి స్వచ్ఛమైన గాలి, నీరు. భాగ్యనగరంలో ఇవే కరువయ్యాయి. ముఖ్యంగా కుత్బుల్లాపూర్‌లోని జీడిమెట్ల పారిశ్రామికవాడలో గాలి, నీరు, చెరువు అన్నీ కలుషితమయ్యాయి. ఈ రసాయనాలతో కలుషితమైన గాలి పీల్చుకొని, నీరు తాగి స్థానికులు అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ప్రధానంగా శ్వాసకోశ, చర్మ సంబంధమైన వ్యాధుల బారిన పడుతున్నారు. జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతవాసుల సమస్యలపై విస్తుపోయే అంశాలెన్నో వెలుగులోకి తీసుకొచ్చింది 'మీతో సాక్షి'.

ఇళ్ల మధ్యనే రసాయన గోదాంలు

జీడిమెట్ల పారిశ్రామికవాడ సుమారు 1,200 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. ఇందులో 1,100లకు పైగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలున్నాయి. చాలా కంపెనీలకు అనుమతులు లేవు. ఇళ్ల మధ్యలోనే అక్రమంగా రసాయన గోదాంలను ఏర్పాటు చేశారు. ఇక్కడ స్థానికులతో పాటు బిహార్, ఉత్తరప్రదేశ్, అస్సాం వంటి రాష్ట్రాల నుంచి వలస వచ్చి జీవనం సాగిస్తున్నారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడను వేరే చోటుకు తరలించాలని ఎన్నో ఏళ్లుగా స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కానీ, వీరి మొర వినిపించుకునే నాథుడే కరువయ్యాడు. సుభాష్‌నగర్, రాంరెడ్డి నగర్, దూలపల్లి, జీడిమెట్ల ప్రాంతాల్లో గాలి, నీరు కలుషితమై ప్రాంతవాసులు అనేక ఇబ్బందులకు, అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు.



సమస్యలు వివరిస్తున్న స్థానికులు

వర్షం పడితే చాలు..

వర్షం పడితే చాలు రసాయన వ్యర్థాలను రోడ్ల మీద, డ్రైనేజీలలో వదిలేస్తున్నారు. దీంతో రోడ్లంతా దుర్గంధం వెదజల్లుతుంది. గుట్టుచప్పుడు కాకుండా గుంతలు తవ్వి రసాయనాలను భూగర్భంలోకి వదులుతున్నారు. దీంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. ఇక బోరు వేస్తే చాలు ఎరుపు, పసుపు ఇలా రోజుకో రంగుతో నీళ్లు వస్తున్నాయి. ఒకవేళ చూసేందుకు తెల్లగా నీరు వచ్చినా కెమికల్ వాసనను వెదజల్లుతున్నాయి. వీటిని తాగేందుకు కాదు కదా కనీస అవసరాలకు కూడా వినియోగించలేని పరిస్థితి.

ఫాక్స్‌కాన్ చెరువు కలుషితం..

తాగు నీటి కోసం ఏర్పాటు చేసిన ఫాక్స్‌కాన్ చెరువు రసాయన వ్యర్థాలతో కలుషితమైపోయింది. రాత్రి వేళల్లో అక్రమంగా వ్యర్థాలను ఈ చెరువులో పారబోస్తున్నారు. దీంతో ఈ చెరువు నీళ్లను తాగి పశువులు, పక్షులు ఇతరత్రా జలచరాలు మృత్యువాత పడుతున్నాయి. సరైన విద్యా, నైపుణ్యత లేకపోవడంతో జీడిమెట్ల పారిశ్రామికవాడలో రియాక్టర్లు పేలిన సందర్భాలు అనేకం.దీంతో ఎప్పుడు ఏ డ్రమ్ము పేలుతుందోనని స్థానికులు భయభ్రాంతులకు గురవుతూ జీవనం సాగిస్తున్నారు.

ఇళ్ల మధ్యకే పరిశ్రమలు వచ్చాయి



గతంలో ఊరికి దూరంగా పరిశ్రమలు ఉండేవి. కానీ, ఇప్పుడు ఇళ్ల మధ్యలో అక్రమంగా రసాయన గోదాంలను ఏర్పాటు చేస్తున్నారు. ఎప్పుడు ఏ డ్రమ్ము పేలుతుందోనని భయం భయంగా ఉండాల్సి వస్తుంది.

– సంతోషి

మా పాలిట శాపమే ఇది



పరిశ్రలకు దగ్గరగా జీవనం సాగించడమే మా పాలిట శాపంగా మారింది. గుంతలు తీసి భూగర్భంలోకి వర్థాలను వదులుతున్నారు. తాగునీరు కలుషితం అవుతుంది.

– రాజేందర్ రెడ్డి

మాటలకే పరిమితం



ఫాక్స్‌కాన్ చెరువును మినీ ట్యాంక్ బండ్ చేస్తామని ఏళ్లుగా అధికారులు చెబుతున్నారు. కానీ అవన్నీ మాటలకే పరిమితం అయ్యాయి. ప్రభుత్వానికి మీం మనుషుల్లాగా కనిపించడం లేదు.

– లక్ష్మి సనకబత్తుల

ఉచిత వైద్య శిబిరం

జగద్గిరిగుట్ట : డివిజన్ పరిధిలోని పాలాల బస్తీలో ప్రభుత్వ ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారు. క్యాంపును డివిజన్ యువజన నాయకుల కొలుకుల జైహింద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన వైద్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఓ వ్యక్తికి డెంగీ సోకినట్లు గుర్తించి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో డాక్టర్ శంకర్, సిస్టర్ లలిత, ఆశా వర్కర్లు కల్యాణి, మౌనిక, శ్రీలత, గాయత్రి, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మి వ్రతం

జగద్గిరిగుట్ట : శ్రావణ మాసం 4వ శుక్రవారం సందర్భంగా చింతల్ శ్రీ సాయి కాలనీలోని అభయ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మి వ్రతం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేదల జోలికొస్తే ఊరుకోం



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం

- నోటీసులివ్వడం సరికాదు
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మోతీనగర్: ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న పేదల ఇండ్లను కూల్చివేస్తామని హైడ్రా అధికారులు నోటీసులివ్వడం సరికాదని, వారి జోలికొస్తే ఊరుకోం అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. నియోజకవర్గంలోని అల్లాపూర్ డివిజన్‌లో కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి హైడ్రా నోటీసులు ఇచ్చిన కుటుంబాలతో శుక్రవారం మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 40 సంవత్సరాలుగా నివాసాలు ఏర్పాటు చేసుకొని పేద ప్రజలు జీవిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాజీవ్ గాంధీనగర్ కాలనీ ఏర్పాటు జరిగిందని, అదే సమయంలో సఫ్దార్ నగర్, పద్మావతి నగర్ ప్రాంతాల్లో ఇళ్లు కట్టుకున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్లు చేసుకున్న ఇళ్లకు సైతం హైడ్రా అధికారులు నోటీసులు జారీ చేయటం బాధాకరమైన విషయమని అన్నారు. పార్టీల లీడర్లతో ఫొటోలు దిగి బిల్డింగ్‌ల దగ్గర లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని, అలాంటి వారిపైన చర్యలు తీసుకోవాలని కోరారు.

నిమజ్జనానికి ఏర్పాట్లను సిద్ధం చేయాలి

- మేయర్ విజయలక్ష్మి
- వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మేయర్



సూరారం లింగా చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి, అధికారులు

కుత్బుల్లాపూర్: గణేష్ నిమజ్జనానికి చెరువులు, బేబీ పాండ్‌లను అన్ని వసతులతో సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సంబంధిత అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ప్రగతి నగర్ చెరువు, లింగం చెరువు, వెన్నెలగడ్డ చెరువు, బేబీ పాండ్‌ల వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, ఆయా కార్పొరేటర్‌లతో కలిసి పరిశీలించారు. గణేష్‌నగర్‌లోని అమ్మ భగవాన్ టెంపుల్ వద్ద బాక్స్ కల్వర్ట్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చెరువులు, బేబీపాండ్ల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. వాహనాల పార్కింగ్ సదుపాయం, బేబీ పాండ్స్ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జనం చేసిన విగ్రహాలు సాంప్రదాయ పద్ధతిలో తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత సిబ్బందికి అవగాహన కల్పించాలని కోరారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని, లైటింగ్, మొబైల్ టాయిలెట్స్, తాగు నీరు, హెల్త్ క్యాంపులు, హెల్ప్ డెస్క్, అవసరమైన క్రేన్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. చెరువుల నుంచి తొలగించిన గుర్రపు డెక్క ఫ్లోటింగ్ మెటీరియల్‌ను తరలించకపోవడంతో రాంకీ ఏజెన్సీపై, అధికారులపై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అట్టి వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గణేష్ ఉత్సవ విగ్రహాల నిమజ్జనం ఏర్పాట్ల పరిశీలనలో పోలీస్, విద్యుత్ శాఖ అధికారులు గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు ముద్దం నరసింహయాదవ్, చింతల విజయ్ శాంతిరెడ్డి, రాజ్ జితేంద్రనాథ్, తార చంద్రారెడ్డి, గౌరీష్ పారిజాత, విజయ్ శేఖర్‌గౌడ్, మంత్రి సత్యనారాయణ, రావుల శేషగిరి, నార్నే శ్రీనివాస్ రావు, శిరీష బాబూరావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుత్బుల్లాపూర్: విద్యుత్‌ఫీడర్ లైన్‌ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ ఓ ప్రకటనతో తెలిపారు. 11కేవీ ధోలారీధనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు ఎస్ఎన్ఆర్ ఫంక్షన్‌హాల్, శ్రీకాంత్‌రెడ్డి ఎస్టిమేట్, పోచమ్మగడ్డ, 11కేవీ నూజివీడు సీడ్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1:30 నుంచి 2 గంటల వరకు నూజివీడు సీడ్స్ కంపెనీ, అశ్విన్ కాలనీ, గ్రీన్‌కౌంటీ, సిల్వర్‌నెస్ట్, ఐడీఏ-2 ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1 నుంచి 1:30 గంటల వరకు దూలపల్లి ఇండస్ట్రీస్ ఏరియాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

పేట్‌బషీరాబాద్ సెక్షన్‌లో..

-11కేవీ వైష్ణవి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు రంగారెడ్డిబండ, వైష్ణవి ఎన్‌క్లేవ్, కల్యాణ్ కన్‌స్ట్రక్షన్స్, ఎస్ఎల్ఎన్ డెవలపర్స్ కాలనీ, గంగా ఎన్‌క్లేవ్, అదే విధంగా 33కేవీ ఎక్స్‌టెన్షన్ వర్క్ నేపథ్యంలో 11కేవీ మీనాక్షి, జీడిమెట్ల గ్రామం, సుచిత్ర ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేట్‌బషీరాబాద్ ఏఈ తెలిపారు.

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, కొత్త కనెక్షన్ల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని బౌరంపేట్ ఏఈ సాయికిరణ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ కేవీఆర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల వరకు ప్రణీత్ నేచర్ బౌంటీ, కేవీఆర్ కాలనీ, స్ప్రింగ్ ఉడ్, జేఎన్ఎస్ విల్లాస్, స్టెర్లింగ్ హోమ్స్, శంభీపూర్ గ్రామం, 11కేవీ బాలాజీ లే అవుట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1 నుంచి 1:30 గంటల వరకు బాలాజీ వెంచర్, ప్రణీత్ జెమ్స్, కోటక్ కన్‌స్ట్రక్షన్, ఆంధ్రబ్యాంక్ వెనుక గల్లీ, సీవీఆర్ కన్‌స్ట్రక్షన్, 11కేవీ ఏజీఎల్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు ఎస్ఆర్ఆర్ హైట్స్, మైస్పేస్- 2, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, 11కేవీ బౌరంపేట్ గ్రామ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు బౌరంపేట్ గ్రామం, ప్రణీత్ బ్లూమ్స్, అక్షయ డెవలపర్స్, డీజీ హోమ్స్, ల్యాండ్ మార్క్, సుకృతి హోమ్స్, ఆర్ఎస్‌కే హోమ్స్, 11కేవీ కోకకోలా ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డీఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల, కేఎల్ యూనివర్సిటీ, డాలర్ డ్రీమ్స్, సింహపురి కాలనీ, గోకుల్ బృందావన్ కాలనీ, నెస్ట్ విల్లాస్, ఎస్‌బీఐ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

భగత్‌సింగ్‌నగర్ ఫీడర్ పరిధిలో..

జగద్గిరిగుట్ట: 11కేవీ భగత్‌సింగ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భగత్‌సింగ్‌నగర్, చంద్రానగర్, దుర్గనగర్, స్ఫూర్తినగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ రాధాకిషన్‌రెడ్డి తెలిపారు.

11కేవీ ఫీడర్ పరిధిలో..

సుభాష్‌నగర్: 11కేవీ మినీ ఇండస్ట్రీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆర్ఎం నగర్, చిక్కుల బస్తీ, జహంగీర్ బస్తీ, సర్దార్ వల్లభాయ్ పటేల్‌నగర్, వివేకానంద నగర్, 11కేవీ మెట్‌కానిగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు శ్రీవెన్ ఎన్‌క్లేవ్, బాలాజీ లేఅవుట్, 11కేవీ క్రషర్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల వరకు కైసర్‌నగర్, సాబేర్‌నగర్, ఏఈహెచ్ఎస్ కాలనీ, లాల్‌సాబ్‌గూడ, 11కేవీ ఆర్ఎం ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు మల్లారెడ్డినగర్ ఫేజ్- 2, ఏఆర్‌కే రాంకీ ఎస్టేట్స్, 11కేవీ కైలాస్ హిల్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మహాదేవపురం, షిరిడీ హిల్స్, కైలాస్ హిల్స్, బాలయ్య బస్తీ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

వైభవంగా లక్ష పుష్పార్చన





అమ్మవారి ఉత్సవమూర్తి


సుభాష్‌నగర్: గాజులరామారంలోని చిత్తారమ్మ దేవి ఆలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష పుష్పార్చన అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదానం నిర్వహించిన మహేశ్వర్ రెడ్డిని ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్ సన్మానించారు.

గ్యాస్‌పైపు లైన్ లీక్.. ఎగిసిపడ్డ మంటలు



మంటలను ఆర్పుతున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది

చింతల్: జీడిమెట్ల పారిశ్రామికవాడ ఫేస్- 3లో భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ కంపెనీ గ్యాస్ పైపులైన్ లీక్ కావడంతో మంటలు ఎగిసిపడ్డాయి. అగ్నిమాపక ఆఫీసర్ తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్లలోని నసెన్స్ ల్యాబ్ ముందు ఉన్న నాలాలో శుక్రవారం తెల్లవారుజాము 2 గంటల ప్రాంతంలో భాగ్యనగర్ గ్యాస్ పైపు లైన్ లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. మంటలను గమనించిన స్థానికులు, నసెన్స్ ల్యాబ్ కార్మికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఉదయం 6 గంటలకు లీకేజీపై సమాచారం అందుకున్న భాగ్యనగర్ గ్యాస్ అధికారులు గ్యాస్ సరఫరాను నిలిపి వేశారు. మంటలు ఆగిపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఇంత పటిష్టమైన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదవశాత్తు లీకేజీ ఏర్పడిందా? లేక మరి ఏమైనా ఇతర కారణాలున్నాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



చింతల్‌కు చెందిన ఐశ్వర్య పుట్టినరోజు సందర్భంగా నిర్మల్ మానసిక దివ్యాంగుల కేంద్రంలో శుక్రవారం అన్నదానం చేశారు. బహుమతులను అందజేశారు. - చింతల్